క్లుప్తంగా

అభివృద్ధే లక్ష్యం

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటించారు. కల్యాణపురం గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గొల్లగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ, కాలువ బజార్, బుడుగు బజార్, పీహెచ్‌సీ పక్కన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకుడు ఓరుగంటి రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి రమేష్‌బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వరప్రసాద్, సీడీపీఓ రేవతి, ఎంపీఓ ముత్యాలరావు, పీఆర్ ఏఈ చారి, ఎంఈఓ వీరస్వామి, మాజీ జెడ్పీ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, ఎస్‌కె.ఖదీర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండాల తహసీల్దార్‌గా స్వర్ణలత

గుండాల: అశ్వాపురం మండల తహసీల్దార్ స్వర్ణలత గుండాల మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాజారావును అశ్వాపురం మండలానికి బదిలీ చేశారు. కాగా ఇటీవల కాలంలో కలెక్టరేట్ నుంచి గుండాలకు వచ్చిన రాజారావు తక్కువ కాలంలోనే బదిలీ చేశారు. ఆయన స్థానంలో స్వర్ణలతను కలెక్టర్ ఉత్వర్వుల మేరకు ఇక్కడికి బదిలీ చేశారు. గురువారం ఆమె బాధ్యతలను స్వీకరించనున్నారు.

అశ్వాపురం తహసీల్దార్‌గా రాజారావు

అశ్వాపురం: అశ్వాపురం మండలం నూతన తహసీల్దార్‌గా రాజారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అశ్వాపురం తహసీల్దార్ స్వర్ణలతను గుండాల బదిలీ చేయగా ఇటీవల కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పని చేస్తూ వారం క్రితం గుండాల తహసీల్దార్‌గా బదిలీ అయిన రాజారావును.. అశ్వాపురం తహసీల్దార్‌గా నియమించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

పార్టీని బలోపేతం చేయాలి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సమష్టిగా పనిచేసి, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య సూచించారు. బుధవారం మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య పరిశీలకులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రవణ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.ప్రమోద్‌కుమార్‌లు హాజరయ్యారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షుల పదవులకు సంబంధించి, అర్హత కల కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పొదెం మాట్లాడారు. అంతకుముందుగా భారత దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పినపాక: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పినపాక కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, పోక్సో చట్టం, తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పినపాక, కరకగూడెం విద్యాశాఖ అధికారులు కొమరం నాగయ్య, మంజుల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కమిటీ నియామకం

దుమ్ముగూడెం: భారతీయ జనతా పార్టీ దుమ్ముగూడెం మండల నూతన కమిటీని అధ్యక్షుడు కంద్రపు త్రినాథ్ రెడ్డి బుధవారం నియమించారు. మండల ఉపాధ్యక్షులుగా కాగితాల త్రినాథ్ రెడ్డి, కారం చిన్నయ్య, కొరస కామయ్య, మోత్కూరి రాధా, ప్రధాన కార్యదర్శిగా కుందవరపు పవన్ కుమార్ , పొందుగల అంజిరెడ్డి, సెక్రటరీగా పలికల రుక్మిణి కుమారి, డేగల సురేష్, జూపల్లి స్వరూప, కొరస గంగరాజు, ట్రెజరర్ గా సామినేని ప్రవీణ్‌లను నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని అబ్బుగూడెం గ్రామానికి చెందిన మామిడి రెమల్య కుటుంబానికి గుంపెన సహకార పరపతి సంఘం తరుపున చైర్మెన్ బోయినపల్లి సుధాకర్‌రావు రూ.లక్ష చెక్కును బుధవారం అందించారు. సొసైటీ పరిధిలో మర్రిగూడెంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో జల్లెడ మిషన్ వద్ద విద్యుదాఘాతానికి గురై రెమల్య ఇటీవలె మృతి చెందిన విషయం విధితమే. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, డైరెక్టర్ బోలు రామకృష్ణ, కొత్తూరి వెంకటేశ్వరరావు, ఎస్‌కె.రహీం పాల్గొన్నారు.

మేల్కొంటేనే మేలు..!

- కోతకు గురైన బ్రిడ్జి రహదారులు
- రానున్న వరద ముప్పుతో సమస్య రెట్టింపు
- శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపులు



కరకట్ట నిర్మించాల్సిన చిరుమళ్ల బ్రిడ్జి రహదారి ఇదే..



ప్రమాదకరంగా బూడిదవాగు బ్రిడ్జి

కరకగూడెం: కరకగూడెం–చిరుమళ్ల గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జికి అనుకుని రహదారికి దుర్భరంగా తయారైంది. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడితేనే రానున్న వర్షాకాలంలో ప్రజలఇబ్బందులు తొలగుతాయి.

రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జికి అనుకుని ఉన్న రహదారి పెద్దవాగు ప్రవాహంతో కొట్టుకుపోయింది. దీంతో చిరుమళ్ల, వట్టంవారి గుంపు గ్రామ పంచాయతీల పరిధిలోని 7 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తరువాత రహదారికి గ్రావెల్ పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గతేడాది జులై నెలలో బ్రిడ్జిని పరిశీలించి తక్షణమే తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు 10లక్షల రూపాయలు కేటాయించి పనులు చూపించిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. అలాగే ఈ నెల 5న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సదరు బ్రిడ్జిని పరిశీలించి 20లక్షల రూపాయలు కేటాయించామని ప్రకటించారు. అసలు బ్రిడ్జికి అనుకుని ఉన్న రహదారికి కరకట్ట నిర్మాణం చేపడితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలువురు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తాత్కాలికంగా ఎన్ని నిధులు కేటాయించి పనులు చేపట్టిన వరద పాలవ్వడం తప్ప మరోక ప్రయోజనం లేదు.

పొంచి ఉన్న ప్రమాదాలు..

మండలంలోని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుగూడెం–గోవిందాపురం గ్రామాల మధ్యగల దుప్పితోగుపై ఉన్న బ్రిడ్జి రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆ రహదారి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా వెళ్తుంటాయి. ఈ క్రమంలో ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే వంతెనకు ఆనుకోని ఉన్న రహదారులకు తాత్కాలికంగా చేసిన మరమ్మతులు దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే వంతెనకు రెండువైపులా రక్షణగా రెయిలింగ్ వాల్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో వాగు ప్రవాహం పెరిగిన సమయంలో రాత్రి వేళలో ఆటోలో సదరు బ్రిడ్జిపై నుండి వెళ్తున్న ఓ యువకుడు ఆ వాగులో పడి మృత్యువాత పడ్డాడు. సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీలోని బూడిదవాగుపై గల వంతెనకు అనుకోని ఉన్న ప్రధాన రహదారి వరదలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.



శాశ్వత పరిష్కారం చూపాలి..



ఏడాదికోసారి వరదొచ్చి ముంచెత్తుతోంది.బ్రిడ్జి దెబ్బతినడంతో మా ఊరు చుట్టుపక్కల ఊర్లతో సంబంధం తెగిపోతోంది.పిల్లలు బడికి పోలేరు,ఆసుపత్రికి పోవాలన్నా చుట్టూ తిరిగొచ్చే పరిస్థితి. ఎంతోమంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. నాయకులు, అధికారులు వచ్చి చూసి పోతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. ఈ బ్రిడ్జి రోడ్డుకు ఎప్పుడు శాశ్వత పరిష్కారం దొరుకుతుందో ఏమో.

– మడకం రవి, కౌలూరు

బ్రిడ్జి కట్టి కష్టాలు తీర్చాలి..



అలుగు ప్రవాహం కొంచెం ఎక్కువైతే చాలు వరద నీళ్ల చప్టా మించి పోతాయి. దీంతో రాకపోకలు పూర్తిగా బంద్ అయిపోతాయి. అత్యవసర సమయాల్లో వేరేప్రాంతాలకు వెళ్లాలన్నా, నిండు నెలలున్న ఆడవాళ్లను ఆస్పత్రికి చేర్చాలన్నా నరక యాతన తప్పదు. పెద్ద వానలొస్తే మా పరిస్థితి ఏంటో తలచుకుంటేనే భయమేస్తోంది. నాయకులు, అధికారులు మా బాధలు అర్థం చేసుకుని లో లెవెల్ బ్రిడ్జి కట్టి మా కష్టాలు తీర్చాలి.

– వాసం కేశవరావు, పద్మాపురం

వరద ముప్పు పొంచి ఉంది..



ఏడాదికోసారి వాగు ఉగ్ర రూపం దాల్చుతోంది. వరద పోటెత్తడంతో బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రహదారి కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. దీని మీదుగా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాహసం చేయాల్సి వస్తోంది. వరద ముప్పు పొంచి ఉంది. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– కోడెం నాగేశ్వరరావు, బంగారుగూడెం

ముగిసిన వేసవి తరగతులు

దుమ్ముగూడెం: తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పర్ణశాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యంఇఒ సున్నం సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి తరగతులు ముగిసినట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం ఏజే ప్రభాకర్ బుధవారం తెలిపారు. వేసవి సెలవుల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి 21 వరకు మొత్తం 60 మంది విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. యోగా, ఆటలు, కరాటే, నృత్యాలు, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించినట్లు వెల్లడించారు. క్యాంపులో ఉపాధ్యాయులు శ్రీధర్,కరాటే శిక్షకుడు వెంకటేష్,నృత్య టీచర్ రాజు పాల్గొన్నారు.

చంద్రుగొండ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్‌క్యాంప్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం సత్యనారాయణ అన్నారు. చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంఏ వాజీద్, వాలంటీర్లు ఆఫ్రీద్, మునీర పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలని హెచ్ఎం పద్మావతి అన్నారు.



దుమ్ముగూడెం: విద్యార్థులకు కరాటే నేర్పిస్తున్న శిక్షకుడు



అశ్వారావుపేటరూరల్: కాపీరైటింగ్ పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. అనంతరం వేసవి శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించగా, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే 70 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కాపీరైట్ నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నోబెల్, సాయిబాబు, సుందరి పాల్గొన్నారు.

ఆక్రమణ దుకాణాలపై చర్యలు



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు రెడ్డి

అశ్వారావుపేటరూరల్: ప్రధాన, అంతర్గత రహదారుల్లో డ్రెయినేజీ దాటి దుకాణాలు, చిరు వ్యాపారులు అక్రమణాలకు పాల్పడితే పెడితే కేసులు నమోదు చేస్తామని స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన అశ్వారావుపేటలోని బీసీఎం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, పాత ఆంధ్రాబ్యాంక్ ఏరియా, రింగ్ రోడ్డు, జంగారెడ్డిగూడెం రోడ్‌ల్లో డ్రెయినేజీ నిర్మాణాలను దాటి నిర్వహిస్తున్న దుకాణాలదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. దుకాణాలను ఇష్టారాజ్యంగా పెట్టుకోవడం వల్ల నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్, మెగా డ్రెయినేజీ నిర్మాణాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారించే వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సై యయాతి రాజు, సిబ్బంది ఉన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం..



ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: నిరుపేదల సొంతింటి కలను నేరవేర్చే బాధ్యతను నేరవేరుస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దబ్బతోగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పత్రాలను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గానికి తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, అలాగే ఐటీడీఏ పరిధిలో ఉన్న అశ్వారావుపేట మండలానికి అదనంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికు వినతి చేశామని అన్నారు. త్వరలోనే అదనంగా ఇళ్లు మంజూరు అవుతాయని వెల్లడించారు. ముందుగా అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలిక పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులంతా కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సీఐ పింగళి నాగరాజు రెడ్డి, ఎంపీఓ సీతారామరాజు, ఏఈ రాము, ఎంఈఓ ప్రసాద్ రావు, కాంగ్రెస్ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి



తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చంద్రుగొండ: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. మండలకేంద్రం చంద్రుగొండ తోపాటు సీతాయిగూడెం, గుర్రాయిగూడెం పంచాయితీల నుంచి తరలివచ్చిన జనంతో నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, అధికారులతోనే లబ్ధిదారుల ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతీపత్రాలను తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెద్దిని వేణు, మాజీ సర్పంచ్ కాక సీత, రాయి రాజా, దాసరి సీతారాములు, మోహన్‌రావు పాల్గొన్నారు.

పర్ణశాలలో మాలధారులు

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం హనుమాన్ మాలధారలతో కిటకిటలాడింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పర్ణశాలకు భారీ ఎత్తున ఒక్క రోజు ముందుగానే హనుమాన్ మాలధారులు తరలిరావడంతో పర్ణశాల గ్రామం అంతా సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన మాలధారులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పున్యస్నానాలు ఆచరించి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడే హనుమాన్ జయంతి పురష్కరించుకుని ఆలయంలో హనుమాన్ మాలధారులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవికుమార్

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని దురదపాడు, మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాల చెరువు గ్రామాల్లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను నిర్వహించారు. పంటల సాగు, పంటల మార్పిడి, ఎరువుల వినియోగం, భూసారం, బిందు సేద్యం, ఉద్యాన పంటలతోపాటు రాయితీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ రవికుమార్, పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ స్వప్న, శాస్త్రవేత్తలు శిరీష, జంబమ్మ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



మణుగూరుటౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి మండల నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధానమంత్రిగా ఆయన అనేక సేవలు అందించారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు నవీన్, శివ, సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, సౌజన్య ఉన్నారు.

కరకగూడెం: దివంగత భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీకి బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలోమాజీ సర్పంచ్ పోలేబోయిన తిరుపతయ్య, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగబండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎర్ర సురేష్, పోలేబోయిన రుక్మారావు, బరపటి వెంకన్న, జట్ల సత్యం, కరకపల్లి నాగేష్, దంచనాల రాజేంద్ర ప్రసాద్, సుర సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులపై ఖండన

దుమ్ముగూడెం: కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యగా కాళేశ్వరం ఘటనపై నోటీస్ ఇచ్చారని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్ష, కార్యదర్శులు లంకా శివ, వాగే కృష్ణలు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కడుపు నిండా కరెంటు ఇచ్చి, సాగు నీటితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసినందుకా ఈ నోటీసులు అని ప్రశ్నించారు. మండే ఎండల్లోనూ వాగుల్లో నీళ్లు పారించి వ్యవసాయంలో తెలంగాణను నంబర్ వన్‌గా కేసీఆర్ నిలిపారన్నారు. భూముల ధరల్లో పెరుగుదలకు కారణం ఆయిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు.

ఎట్టకేలకు మురుగు తొలగించారు..

ములకలపల్లి: మండల కేంద్రంలోని గ్రోమోర్ షాపు ఎదరుగా పేరుకుపోయిన మురుగును ఎట్టకేలకు తొలగించారు. ములకలపల్లి బస్టాండ్ సెంటర్‌కు అతిసమీపంలోని ఈ ప్రదేశంలో ఏడేళ్ల క్రితం అంతర్గత సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుకు అడ్డంగా కొందరు మట్టికుప్పలు వేశారు. దీంతో మట్టి వద్ద భారీగా మురుగు పేరుకుపోయింది. ఎక్కువైన సందర్భంలో మురికినీరు ములకలపల్లి గ్రామంలోకి వెళ్లే సీసీ రోడ్డు పక్కగా ప్రవహించి, ఎస్టీ హాస్టల్ ఆవరణలోకి చేరేది. దీంతో ఈ ప్రదేశంగా దుర్గంధం వెదజల్లడంతోపాటు, అటుగా వెళుతున్న పాదచారులపై మురుగునీరు చిమ్ముతుండేంది. ఈ ఉదంతంపై పలుమార్లు పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు దృష్టి సారించారు. ఎంపీడీఓ గద్దె రేవతి ఆదేశాల మేరకు జీపీ కార్యదర్శి రవి మురుగు తొలగించే పనులకు ఉపక్రమించారు. సీసీ రోడ్డుపై పోసిన మట్టికుప్పలను బుధవారం తొలగించారు. గ్రామంలోని వెళ్లే సీసీ రోడ్డు పక్కగా కాలువ తవ్వించారు. దీని గుండా మురుగునీరు కోనేరులోకి వెళ్లేలా తాత్కాలికంగా మార్గం తయారు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ ప్రదేశంలో డ్రెయినేజీ నిర్మించి, శాశ్వత పరిష్కారం చూపాలని అభ్యర్థిస్తున్నారు.



తాత్కాలికంగా డ్రెయినేజీ కాలువ ఏర్పాటు చేసిన దృశ్యం

సెలవుల్లోనూ పౌష్టికాహారం

- అంగన్‌వాడీల్లో ఆగని పంపిణీ
- ఇళ్లకు వెళ్లి కూడా అందజేత
- ఫలిస్తున్న ప్రభుత్వ చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

భద్రాచలంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాయి. వేసవి నేపథ్యంలో ప్రభుత్వం అంగన్‌డీ కేంద్రాలకు మే నెలలో సెలవులు ప్రకటించింది. పౌష్టికాహారం కోసం లబ్ధిదారులు కేంద్రాలకు రావడం లేదు. దీంతో ఆహార సరఫరా నిలిచిపోతోంది. ఈ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు వారానికి ఒకసారి నేరుగా పౌష్టికాహారం అందించే విధానం అమల్లోకి తెచ్చింది.

లబ్ధిదారులకు ఊరట..

మే నెలలో ఎండల తీవ్రత కారణంగా గర్భిణులు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు రాకపోవడంతో పౌష్టికాహారం అందడం ఆగిపోయేది. ఈ సమస్యను గుర్తించిన అంగన్‌డీ టీచర్లు, ఆయాల యూనియన్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించాయి. దీంతో అయితే కేంద్రాలు తెరిచే ఉంటాయి. లబ్ధిదారులు, పిల్లలకు సెలవులు వర్తిస్తాయి. ఈ సమయంలో టేక్ హోం రేషన్ అమలు చేసింది. మే నెలలో మొదటి పదిహేను రోజులు అంగన్‌వాడీ టీచర్, తరువాత పదిహేను రోజులు హెల్పర్ సెలవులు తీసుకుంటారు. విధుల్లో ఉండే రోజుల్లో సిబ్బంది కేంద్రాలు తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారు. ఆరేళ్లలోపు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు బియ్యం, పప్పు, నూనె, పాలు బాలామృతం, కోడిగుడ్లు వంటి సరుకులు అందిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు సెలవులు వర్తిస్తాయి. విధుల్లో ఉన్న సిబ్బంది టీహెచ్ఆర్ పంపిణీ అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులను చేర్పించడం, పిల్లల ఎత్తు, బరువు చూడటం, బడిఈడు పిల్లలను గుర్తించడం వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ నిర్ణయంతో అంగన్వాడీ నిర్వాహకులతోపాటు లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


పౌష్టికాహార సరఫరా ఇలా..

దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలో 173 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల నుంచి 606 మంది గర్భిణులు, 494 మంది బాలింతలు, 7 నెలలలోపు 507 మంది, 7 నెలల నుంచి 3 ఏళ్ల వరకు 2659 మంది, 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వరకు 2379 మంది చిన్నారులు పౌష్టికాహారం పొందుతున్నారు. రోజూ భోజనం, గుడ్లు, పాలు, స్నాక్స్ అందించాల్సి ఉంటుంది. సెలవుల సమయంలో వారానికి ఒకసారి నేరుగా సరుకులు పంపిణీ చేస్తున్నారు.

పర్యవేక్షణ అవసరం..

కొందరు లబ్ధిదారులు కేంద్రాలకు రాకపోవడం, టీచర్లు,ఆయాలు పంపిణీలో నిర్లక్ష్యంచేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవచ్చు. ఈ నేపథ్యంలో, జిల్లా ఉన్నతాధికారులు కఠిన పర్యవేక్షణతో పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కొత్త విధానం లబ్ధిదారులకు నిరంతర ఆహార సరఫరాకు దోహదపడనుంది.

కేంద్రాలు తెరిచే ఉంటాయి



అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ సిబ్బందికి సెలవులున్నా కేంద్రాలు తెరిచే ఉంటాయి. అంగన్వాడీ టీచర్, హెల్పర్లో ఎవరైనా ఒక్కరు కేంద్రంలో అందుబాటులో ఉంటారు. కేంద్రాల్లో వంట చేయకుండా సరుకులు ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నాం. ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు పౌష్టికాహారానికి సంబంధించిన సరుకులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జ్యోతి, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్ట్